క్లుప్తంగా

నేడు ఇసుక బజార్ ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ, ఆదిబట్ల పట్టణ కేంద్రంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రభుత్వ ఇసుక బజార్‌ను ప్రారంభించనున్నామని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అధితులుగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, టీజీ ఎంఐడీసీ చైర్మన్ ఇరావత్ అనిల్, ఎండీ సుశీల్‌కుమార్‌లు రానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



కార్మికులకు చీరలు అందజేస్తున్న సంఘం నాయకులు

ఆమనగల్లు: అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుని సోమవారం ఆమనగల్లు పట్టణం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేశ్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యుడు వస్పుల సాయిలు, పులికంటి మైసయ్య, జంతుక శంకర్, అల్లాజీ, విజయ్‌కుమార్, అఫీజ్, రమేశ్, ప్రసాద్, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన మూడ పాపయ్య, ముత్యాల పోచమ్మ అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను సోమవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డిలు పరామర్శించారు. రూ.15 వేల చొప్పున, ఇరు కుటుంబాలకు రూ.30 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో బాలయ్య, మహేశ్, నర్సింహ, అంజి, మహేశ్, జంగయ్య, సురేశ్ ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

మంచాల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండలంలోని కాగజ్‌ఘట్ గ్రామంలో ఏర్పాటు అంబేడ్కర్, జ్యోతిబా పూలే విగ్రహాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహనీయుల బాటలో ముందుకు సాగాలని సూచించారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



మహాపడిపూజలో భక్తజనం

ఆమనగల్లు: అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. మణికంఠుడి జయంతిని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలోని అయ్యప్ప కొండపై వెలసిన శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో, ఆలయ కమిటీ చైర్మన్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఆధ్వర్యంలో సోమవారం పడిపూజ చేశారు. భక్తుల భజనల మధ్య పడిని వెలిగించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు సుందారి శేఖర్, చెక్కల లక్ష్మణ్, భక్తులు అల్లాజి, అంజయ్య, నర్సింహ, మురళీధర్, రాజు, మహేశ్, శ్రీనివాస్, మహేశ్‌గౌడ్, నర్సింహ పాల్గొన్నారు.

భూ భారతి ప్రారంభోత్సవాన్ని వీక్షించిన రైతులు



సీఎం ప్రోగ్రాంను వీక్షిస్తున్న నాయకులు, రైతులు, అధికారులు

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి పోర్టల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సోమవారం రైతు వేదికలో అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు రైతులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పి.కృష్ణగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రశాంత్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఓ లావణ్య పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: పట్నం మండల కేంద్రంలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నంలో.. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్లలో.. కమిషనర్ బాలకృష్ణ

గొప్ప దార్శనికుడు అంబేడ్కర్

'బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. ఆయన పుణ్యమాని నేడు ప్రతి రంగంలో అన్ని వర్గాల ప్రజలకు తగిన ప్రాధాన్యత దక్కుతోంది' అని ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజా సంఘాల నేతలు అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. అంటరానితనం, కులనిర్మూలనకు పోరాటం చేసిన మహనీయుడు బాబా సాహెబ్ అని కొనియాడారు. దూరదృష్టితో సకల జనులకు న్యాయం జరిగేలా రాజ్యాంగాన్ని నిర్మించి, దేశానికి అందించిన గొప్ప దార్శనికుడని పేర్కొన్నారు. అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు.

– సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు



కడ్తాల్‌లో.. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్ నాయక్, ఐక్య వేదిక అధ్యక్షుడు రాఘవేందర్



ఇబ్రహీంపట్నం రూరల్: యాచారంలో సీపీఎం ఆధ్వర్యంలో..



మాడ్గుల: కోల్కులపల్లిలో..



ఆమనగల్లు: యువజన సంఘం ఆధ్వర్యంలో..



తుర్కయంజాల్‌లో.. డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య



పెద్దఅంబర్‌పేట్.. గౌరెల్లిలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో..



అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేటలో డీసీసీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పెంటయ్య తదితరులు



అబ్దుల్లాపూర్‌మెట్ కూడలిలో..

ఎమ్మెల్యే పరామర్శ

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములు మాతృమూర్తి జంగమ్మ ఆదివారం మృతి చెందారు. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు ఆమనగల్లు మండలం శంకరకొండతండాలో రాములును పరామర్శించారు. ఇందులో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరిప్రసాద్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విక్రంరెడ్డి ఉన్నారు.

నేడు బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం

బడంగ్‌పేట్: బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం బడంగ్‌పేట్‌లోని ఓ గార్డెన్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్షకు పార్టీ శ్రేణులు విధిగా పాల్గొని, విలువైన సూచనలు, సలహాలు ఇచ్చి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్

షాబాద్: రైతు సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి సరికొత్త పోర్టల్ ఆవిష్కరణ ప్రత్యక్ష ప్రచారాన్ని ఆయన నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి పోర్టల్ ద్వారా భూ సమస్యల పరిష్కారం, లావాదేవీల సమాచారాన్ని రైతులు, ప్రజలకు సులభంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిందని పేర్కొన్నారు. ప్రారంభ దశలో మూడు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసి, ప్రజల సూచనల ఆధారంగా పోర్టల్‌ను మెరుగుపరచనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంకటేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అశోక్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్ రెడ్డి, ఖాజామీ యా, శ్రీనివాస్‌గౌడ్, లింగం, శేఖర్‌రెడ్డి, మునగపాటి నర్సింలు, నాయకులు స్వామి, అశోక్, యాద య్య, నర్సింలు, రాహుల్, శేఖర్, సుభాశ్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది



అన్నదానం ప్రారంభిస్తున్న లయన్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి తదితరులు

కడ్తాల్: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా అన్నారు. సంఘ సేవకుడు గంప లక్ష్మయ్య వర్ధంతిని పురస్కరించుకుని, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో మీల్స్ అండ్ వీల్స్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్ ఆమనగల్లు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, గంప శ్రీనివాస్, రమేశ్, ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు రాముగుప్తా, యూత్ వింగ్ అధ్యక్షుడు దేవేందర్ గుప్తా, క్లబ్ సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, సాయి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, నాయకులు నర్సింహ, చేగూరి వెంకటేశ్, బీచ్యానాయక్, మహేశ్‌దోనాదుల, రాజేందర్ యాదవ్, రాఘవేందర్, సతీశ్, శ్రీకాంత్, రామకృష్ణ, మహేశ్, జగదీశ్ తదితరులు ఉన్నారు.

చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



కల్యాణ వేడుకలో భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం చెన్నంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో సోమవారం చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛారణలతో వైభవంగా జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడురి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటరమణారెడ్డి, శ్రీనయ్య, మాజీ ఉపసర్పంచ్ జగన్, ఆలయ నిర్వాహకులు పర్వతాలు, కృష్ణ, రవి, శ్రీను, వెంకటేశ్, నర్సింహ, యాదయ్య, కృష్ణయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కందుకూరు: మండల పరిధిలోని లేమూరులో గల వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సంలో భాగంగా ఆలయ చైర్మన్ గూడూరు కొండారెడ్డి ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల సమక్షంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం చివరిరోజు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు తెలంగాణ లోకాయుక్త చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. పురాతన దేవాలయాలను పునరుద్ధరించి అభివృద్ధి చేయడం గొప్ప విషయమని కొనియాడారు. కాగా పూజల అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె.రాంప్రతాప్‌రెడ్డి, ఢిల్లీ బాలకృష్ణ, రావిచెట్టు ఐలయ్య, గుల్వి జైపాల్, కాశింశెట్టి రాఘవేందర్, మాజీ సర్పంచ్ ఢిల్లీ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సన్నబియ్యంతో వండిన భోజనం తింటున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు

కొత్తూరు: అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా సంక్షేమ పథకాలు అందిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, పలువురు నాయకులతో కలిసి ఆయన పట్టణంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. అనంతరం కాలనీలో ఉన్న ఇస్తారి ఇంట్లో ప్రభుత్వం నుంచి సరఫరా అయిన సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. అంతేకాకుండా బియ్యం నాణ్యతపై ఆయన పలువురిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఉన్న అర్హులందరికీ రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా నాణ్యతతో కూడిన సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియను రేషన్ డీలర్లు సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. సకాలంలో బియ్యం పంపిణీ చేయడంతో పాటు తూకంలో ఎలాంటి అక్రమాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో నిజమైన అర్హులకు సంక్షేమ పథకాలు అందిన దాఖలాలు లేవని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజాక్షేత్రంలోనే సభలు నిర్వహించి నిజమైన అర్హులను గుర్తించినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, జగన్, సురేందర్, శివశంకర్‌గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి

పంచాయతీ కార్యదర్శి తేజస్విని



గ్రామసభలో మాట్లాడుతున్న కార్యదర్శి తేజస్విని

షాద్‌నగర్: ప్రజలందరి భాగస్వామ్యంతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని పంచాయతీ కార్యదర్శి తేజస్విని అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి తేజస్విని ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలు–పరిష్కార మార్గాలపై గ్రామస్తులతో చర్చించారు. అనంతరం తేజస్విని మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సమస్య, వీధి దీపాల ఏర్పాటు, సంపూర్ణ పారిశుద్ధ్యం, అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం వంటి వసతులను పూర్తి స్థాయిలో కల్పించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా ఐకమత్యంతో ఏకతాటిపైకి వచ్చినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్లు, మాజీ ఉపసర్పంచ్‌లు, మాజీ వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘం నాయకురాలు, ఆశవర్కర్లు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.